# ఉత్తమ పెట్టుబడి మార్గం 'సిప్'



పి.జయప్రకాశ్



ఈ సంవత్సర ఆరంభంలో నా స్నేహితుడొకరు నాదగ్గరకు వచ్చారు. తనకు నెల వారీగా ఇంటి అద్దె రూపంలో ఆదాయం ఉన్నట్లు చెప్పి, దానిని సక్రమంగా పెట్టుబడి పెట్టడానికి మార్గం ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. మ్యూచువల్ ఫండ్ పథకాల్లో సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్ఐపీ- సిప్) పద్ధతిలో నెల నెలా పెట్టుబడి పెట్టవచ్చని ఆయనకు సూచించాను. అంటే ఏమిటని మళ్లీ అడిగిన మీదట, అన్ని వివరాలు చెప్పాను. మంచి పనితీరును కనబరుస్తున్న డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌ను ఎంచుకొని, అందులో ప్రతి నెలా తనకు వచ్చే అద్దె ఆదాయాన్ని పెట్టుబడి పెడితే దీర్ఘకాలంలో అనూహ్యమైన ప్రతిఫలం ఉంటుందన్నాను. గత పది పదిహేనేళ్ల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రతిఫలం 21-25 శాతం వరకు ఉన్నట్లు చెప్పగానే ఆయన నిశ్చేష్టుడయ్యారు. ఏమిటి..! ఇంత ప్రతిఫలమా? , మరి ఇన్నాళ్లు ఎందుకు నా చెవిన వేయలేదు, ఎంత చక్కటి అవకాశం పోయింది? ఓ పదేళ్ల ముందు చెబితే ఇప్పటికే నేను లక్షాధికారిని అయి ఉండే వాడిని కదా అని నిష్ఠురమాడారు. అయితే మించిపోయిందేమీ లేదని, ఎప్పటికప్పుడు అవకాశాలు ఉంటాయని, వెంటనే సిప్ పద్ధతిలో పెట్టుబడి పెట్టాలని సూచించగా, అలాగేనంటూ హుషారుగా వెళ్లిపోయారాయన.

భారత ఆర్థిక వ్యవస్థ ఎంతో వేగంగా వృద్ధి చెందుతున్న విషయాన్ని ఇప్పుడు ప్రపంచం అంతా గుర్తిస్తోంది. అందుకే పెట్టుబడులు వరదలా ఇక్కడకు తరలివస్తున్నాయి. ఈ ప్రగతి ప్రయాణం ఇప్పట్లో ఆగేది కాదు. వచ్చే 30 ఏళ్లలో ఇక్కడ ఏ స్థాయిలో అభివృద్ధి ఉంటుందో చెప్పనలవి కాదు. అందువల్ల దీనిని గమనించి ప్రతి ఒక్క మదుపుదారు తనకు తగిన స్థాయిలో దీర్ఘకాలిక పెట్టుబడులకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో కాలపరీక్షకు నిలిచిన పెట్టుబడి సిద్ధాంతమైన 'సిప్'ను అందరూ పరిగణనలోకి తీసుకోవడం అవసరం. తద్వారా నవీన భారత ఆర్థిక ప్రగతి ప్రయాణంలో పాలుపంచుకొనే అవకాశం లభిస్తుంది.

స్వల్ప మొత్తాల్లో నెలసరి సంపాదన ఉన్న వారికి ఈ క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ఎంతో అనువైంది. పైగా ఇందులో రిస్క్ (నష్టభయం) కూడా ఎంతో తక్కువ. నెలకు ఏ అయిదు వేల రూపాయలో లేక పది వేల రూపాయలో సంపాదించే వ్యక్తి, ఒకే సారి ఏక మొత్తంలో యాభై వేల రూపాయలో లేక లక్ష రూపాయలో షేర్లలో పెట్టుబడి పెట్టడం అంటే అది అయ్యే పని కాదు. అంత మొత్తం అతని వద్ద పోగు కావడానికి ఎంతో కాలం పడుతుంది. కానీ అదే సిప్ పద్ధతిలో నెలకు రూ.500 నుంచి తన శక్తి మేర మ్యూచువల్ ఫండ్‌లలో పెట్టుబడి పెట్టవచ్చు. ఉదాహరణకు నెలకు రూ.1,000 చొప్పున 30 సంవత్సరాల పాటు 'సిప్' మార్గంలో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెడితే 18 శాతం వార్షిక ప్రతిఫలం అందిందనుకొంటే ముప్పై ఏళ్లలో అది రూ.1.40 కోట్లు అవుతుందంటే ఆశ్చర్యపోతారు! కానీ ఇది వాస్తవం. మన దేశంలో ఈక్విటీ మార్కెట్లలో పెట్టిన పెట్టుబడులపై దీర్ఘకాలంలో సగటున ఏటా 18 శాతం పెట్టుబడి లభిస్తోంది. అదే ప్రతి నెలా పెట్టే పెట్టుబడి రూ.10,000 అయితే, 30 ఏళ్ల తరువాత అది రూ.14 కోట్ల మొత్తం అవుతుంది. ఈ అంకెలు నిస్సందేహంగా కళ్లు తిరిగిపోయేవే. కాకపోతే 'సిప్' పద్ధతిలోనే ఉంది మహత్యం అంతా!

1. క్రమశిక్షణతో ప్రతినెలా నిర్ణీత తేదీకి కొంత మొత్తం పెట్టుబడి పెట్టడం.
2. హెచ్చుతగ్గుల్లోనూ పెట్టుబడి ఆగదు కాబట్టి, సగటు ప్రతిఫలం అందుతుంది.
3. ఈక్విటీ పెట్టుబడుల ప్రయోజనానికి తోడు ప్రతిఫలం వేగంగా పెరుగుతూ ఉండటం.

ఈ కారణాల వల్ల ఈ పెట్టుబడి విధానంలో రిస్క్ తక్కువై, పెట్టుబడులు అధిక ప్రతిఫలాన్ని ఇస్తాయి. స్టాక్ మార్కెట్ కుప్ప కూలినా భయపడవలసిన పని లేదు. అత్యంత వేగంగా పెరిగితే ఛాన్స్ మిస్ అయిపోతామనే భయం అసలే ఉండదు. ఏ షేర్ కొనాలి, ఎప్పుడు అమ్మాలి.. అనే సందిగ్ధంలో పడే అవసరమే ఉండదు. మీ పెట్టుబడి మీ ప్రమేయం లేకుండా ఒక పక్క పెరిగిపోతూ ఉంటే, మీరు మీ అసలు పని మీద పూర్తి స్థాయిలో నిమగ్నులు కావచ్చు. బహుళ అంతస్తుల భవనాన్ని ఇటుక మీద ఇటుక పెట్టి కట్టాల్సిందే అని చైనా సామెతే పెట్టుబడులకు మూల సూత్రం. పెద్దగా శ్రమ పడకుండా దీర్ఘ కాలంలో భారీ మొత్తాన్ని కళ్ల చూడటానికి 'సిప్'ను మించిన ఉత్తమ మార్గం లేదనిపిస్తోంది.

(రచయిత ఆర్ఎల్‌పీ సెక్యూరిటీస్‌లో డైరెక్టర్)